క్లుప్తంగా

రేపు శ్రీవారి గరుడవాహన సేవ



ప్రత్యేక అలంకరణలో పద్మావతి వేంకటేశ్వరస్వామి

ఆదోని అర్బన్ : రథసప్తమి సందర్భంగా శనివారం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో స్థానిక కోట వెంకటరమణస్వామి ఆలయంలో శ్రీవారికి గరుడ వాహనసేవ నిర్వహిస్తామని పెండేకల్ శివ, నాగరాజు గురువారం తెలిపారు. ఉదయం సుప్రభాతం, వేదపారాయణం,పాసరములసేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు.ఉదయం 8;30 నుంచి 9;30 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో గరుడ వాహనంపై స్వామి అమ్మవార్ల ఉత్సమూర్తులను ఆశీనులు గావించి ఊరేగిస్తామని చెప్పారు. అనంతరం తిరువెండి కాపుసేవ, విష్ణుసహస్ర నామ పారాయణం చేపడతామన్నారు. అలాగే సుస్వరం నాగరాజాచార్యులు గరుడ వైశిష్టంపై ప్రవచనాలు వినిపిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం తమిళనాడు శ్రీపాదంతాంజి ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణ సేవ, లక్ష్యార్చన పూజలు ఉంటాయని వివరించారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ



శ్రీనివాసులు, సీఐ

మంత్రాలయంరూరల్: మంత్రాలయం సీఐగా పనిచేస్తున్న భాస్కర్ వీఆర్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో శ్రీనివాసులు నియమితులైన విషయం తెలిసిందే. గురువారం శ్రీనివాసులు సీఐగా బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్లిన భాస్కర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎస్ఐలు వేణుగోపాల్‌రాజు, కిరణ్ సిబ్బంది ఉన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

కోసిగి: ఆర్లబండ సహకార పరపతి సంఘంలో తీసుకున్న పంట రుణాలు సకాలంలో చెల్లించి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వడ్డీ రాయితీని పొందాలని సంఘం అధ్యక్షుడు మహంతేష్ స్వామి, సంఘం సీఈఓ రవికుమార్ తెలిపారు.గురువారం సంఘం కార్యాలయ ఆవరణలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంఘం పరిధిలో ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతు నేస్తం కింద 190 మంది రైతులకు రూ.10కోట్లు, రాజన్న చేయూత కింద 68 మంది రైతులకు రూ.1.66కోట్లు, పంట రుణాలు కింద 620మంది రైతులకు రూ.3.90 కోట్లు అందించినట్లు చెప్పారు. రైతులు మార్చి ఆఖరిలోపు పంట రుణాలు చెల్లిస్తే ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీ, సంక్షేమ పథకాలు లబ్ధి పొందుతారన్నారు.సంఘం డైరెక్టర్ ఉసేన్ పీరా, నరసప్ప, సిబ్బంది హరినాథ్, హేమంత్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పెద్దకడబూరు : గుడిసె దగ్ధమై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి కురువ సంఘం నాయకులు ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మండలంలోని జాలవాడి గ్రామానికి చెందిన కురువ బజారి గుడిసె శనివారం దగ్ధమైన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న కురువ సంఘం జిల్లా అసోషియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి రంగస్వామి, నాయకులు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన విద్యార్థి తిరుమలేష్ నవోదయ విద్యాలయానికి ఎంపికైనందుకు మెమెంటోతో సత్కరించారు. బూదూరు లక్ష్మన్న, దివాకర్, యల్లయ్య, బాలరాజు, తరుణ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పీఠాధిపతికి తులాభారం



మిఠాయిలతో తులాభారం వేస్తున్న దృశ్యం

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులకు విజయవాడకు చెందిన సూర్యనాథ్‌రెడ్డి అనే భక్తుడు పుల్లారెడ్డి స్వీట్స్ వారి మిఠాయిలతో గురువారం తులాభారం నిర్వహించారు. అంతకు ముందు ఆయన గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. తులాభారం అనంతరం పీఠాధిపతి ఆయనకు శేషవస్త్రం కప్పి ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



రక్తదానం చేస్తున్న యువకులు

చిప్పగిరి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని నగరడోణ గ్రామంలో స్టార్ ఫ్రెండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి, లింగారెడ్డి, కోటిరెడ్డి, భీమ్ రెడ్డి, స్టార్ ఫ్రెండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, గోపి చారిటబుల్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



డీఎస్పీ కార్యాలయంలో జాతీయజెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న సీఐలు



మున్సిపల్ పాఠశాలలో జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్



పెద్దకడబూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఎంపీపీ శ్రీవిద్య



కోసిగి తహసీల్దార్ కార్యాలయం ఎదుట జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న తహసీల్దార్ రుద్రగౌడ



దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు

ఘనంగా గణతంత్ర దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: 74వ గణతంత్ర దినోత్సవ వేడకలు ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా జరిగాయి. ఆయా ప్రాంతాల్లో తహసీల్దార్‌లు, ఎంపీపీలు, పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు. వక్తలు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. వేడుకల సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు దాతలు, సంస్థల సహకారంతో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదోని అర్బన్/ఆదోని రూరల్ : 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను గురువారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ జెండాను ఆవిష్కరించారు. ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, టూటౌన్ సీఐ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు. కోర్టు ఆవరణలో జిల్లా జడ్జి పి.జె.సుధా జెండా ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ రాజశేఖర్ రావు, తాలూకా పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహేశ్వర్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే తనయుడు, యువ నాయకుడు జయమనోజ్‌రెడ్డి, పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి జాతీయజెండా ఎగురవేశారు.

పెద్దకడబూరు : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మార్సీలో ఎంఈఓ సువర్ణల సునియం సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో వినికిడి లోపం ఉన్న 8 మంది విద్యార్థులకు ఉచితంగా వినికిడి మిషన్‌లు, నడవలేని ఓ విద్యార్థికి రోలేటర్‌ను అందజేశారు.



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జెండాను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ ఈఓ సుకుమార్



జెండా ఎగురవేస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



మండగిరిలో గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేస్తున్న అధికారులు



కోసిగిలో జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మిల్టన్ పాఠశాలలో నృత్యం చేస్తున్న చిన్నారి



జెండాకు వందనం సమర్పిస్తున్న ముస్లింలు



బదినేహాల్ జెడ్పీ పాఠశాల వద్ద పావురాలను ఎగురవేస్తున్న దృశ్యం



కౌతాళంలో మాట్లాడుతున్న ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, చిత్రంలో తహసీల్దార్ , ఎంపీడీఓ



మంత్రాలయం సర్కిల్ కార్యాలయంలో జెండావిష్కరణ గావిస్తున్న సీఐ శ్రీనివాసులు



ఎన్‌సీసీ కేడెట్స్ నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్



మసూదియా ఉర్దూ ఉన్నత పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠోత్సవాలు



బంగారమ్మవ్వ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం



మాట్లాడుతున్న మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు

మంత్రాలయం రూరల్: మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో దాదాపు రూ. కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన బంగారమ్మవ్వ ఆలయంలో బంగారమ్మవ్వ విగ్రహ పునఃప్రతిష్ఠోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ముందుగా ఆలయంలో చండీయాగం చేపట్టారు. అనంతరం ధ్వజ స్తంభం, కలశ ప్రతిష్ఠాపన చేశారు. గ్రామానికి చెందిన నరసింహప్ప (గుంతకల్లు డీఎస్పీ) ధ్వజస్తంబాన్ని తయారు చేయించగా, అనంతపురం ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి దేవాలయ సమీపంలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. కార్యక్రమానికి శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికులు పీఠాధిపతిని ఊరేగింపుగా ఆలయం వద్దకు తోడ్కొని వచ్చారు. ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డి, మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. మాధవరం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బహుమతుల ప్రదానం



గెలుపొందిన జట్టుకు షీల్డ్ అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

ఆదోని అర్బన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో మున్సిపల్ ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు కబడ్డీ, షటిల్, క్రికెట్, క్యారమ్స్, చెస్ ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి గురువారం బహుమతులు, షీల్డ్ అందజేశారు. క్రికెట్‌లో విన్నర్‌గా వలంటీర్ టీం, రన్నర్‌గా అడ్మిన్ టీం, షటిల్‌లో విన్నర్‌గా రాజునాయక్, ఖాసిం, రన్నర్‌గా ఖలీల్, రామయ్య, క్యారమ్స్‌లో విన్నర్‌గా కృష్ణ, రన్నర్‌గా వీరేష్, చెస్‌లో విన్నర్‌గా గణేష్, రన్నర్‌గా రాముడు, కబడ్డీలో విన్నర్‌గా మేస్త్రీ టీం, రన్నర్‌గా వర్కర్స్ టీం గెలుపొందారు. మున్సిపల్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సునీల్‌రాజ్‌కుమార్, శివ, జాన్, వినయ్, కృష్ణ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీవారు



స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, సరస్వతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని గరుడ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎస్వీ విజయ మనోహరి పూజల్లో పాల్గొన్నారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్.కె. రాజశేఖర్ రావు, ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి హెచ్‌కె మనోహర రావు, కమిటీ సభ్యులు, మహిళా సేవా దల్, వాయుసేన సేవా దల్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో గురువారం శ్రీవారాహి అమ్మవారు, శ్రీ రాజ శ్యామల అమ్మవారు, శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం విశేషంగా జరిగింది. వేద పండితులు మామిళ్లపల్లి జగన్మోహన్ శర్మ ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠ చేపట్టారు. లలితా పీఠం పీఠాధిపతులు మేడా సుబ్రహ్మణ్య స్వామి అనుగ్రహ భాషణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నించే వారిని ఎన్నుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: శాసన మండలిలో సమస్యలపై ప్రశ్నించే వారిని ఎన్నుకోవాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, నిరుద్యోగుల సమస్యలపై ప్రశ్నించే తత్వం గల వారిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎన్నుకోవాలని సూచించారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి తిమ్మన్న, ఆయా ఉపాధ్యాయ జిల్లా నాయకులు పాల్గొన్నారు.







ప్రత్యేక అలంకరణలో సరస్వతీ దేవి, సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు,సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా వసంత పంచమి

ఆదోని అర్బన్ : పట్టణ శివారు ఎమ్మిగనూరు రోడ్డులోని రుద్రానంద సరస్వతి మఠంలో గురువారం వసంతపంచమి సందర్భంగా సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రేణువర్మ, తిమ్మప్ప ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసం జరిపించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు, నారికేలలు సమర్పించి పూజలు చేశారు. ఉపాధ్యాయులు మల్లారి నాగరాజు, సుధాకర్ చంద్రశేఖర్, నరసన్న, గురుస్వామి, గుండెప్ప, సుజాత, నాగస్వర్ణలత, సునీత, గొట్ల చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మంత్రాలయం రూరల్: మండల కేంద్రం ఎమ్మిగనూరు రహదారిలో జగనన్న కాలనీ సమీపంలో ఎమ్మిగనూరు నుంచి మంత్రాలయం వైపు వస్తున్న లారీ గురువారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో నందవరం గ్రామానికి చెందిన రామకృష్ణ(35) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరుకు తరలించారు.

కమ్యూనిటీ భవనం ప్రారంభం



కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న గురునాథ్‌రెడ్డి

కౌతాళం: మండలంలోని బాపురం గ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు గురునాథ్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు పాటుపడుతున్న ఆర్డీటీ సంస్థకు తోడ్పాటునివ్వాలని కోరారు. అనంతరం కమ్యూనిటీ భవనం ముందు జాతీయ జెండా ఆవిష్కరించారు. నాయకులు జైపాల్, దావీదు, జలాలి, లక్ష్మణ్ చిన్న తిమ్మప్ప, రామలింగ, ఆర్డీటీ ప్రతినిధి రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కంకణధారణ

హొళగుంద: మండల కేంద్రంలో ఈ నెల 31న జరిగే సిద్దేశ్వర స్వామి రథోత్సవం ఇతర కార్యక్రమాలను పురస్కరించుకుని బుధవారం ఆలయంలో స్వామి విగ్రహాలకు కంకణ ధారణ కార్యక్రమం ఘనంగా జరిగింది. సిద్దప్ప, సిద్దమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు, ఆలయ నిర్వాహకులు అనంతరం స్వామి వారికి కంకణధారణ చేశారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారి విరాట్‌మూర్తికి మహా మంగళారతి, అభిషేకాలు, నైవేద్య సమర్పణ జరిగాయి. అలాగే ఇతర ప్రత్యేక పూజలతో పాటు మాంగళ్య, నిశ్చితార్థ కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 31న సిద్దేశ్వరస్వామి రథోత్సవం, ఫిబ్రవరి 1న లంకాదహనం, 2న కంకణ విసర్జన కార్యక్రమంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త రాజ పంపన్నగౌడ విలేకరులకు తెలిపారు.



కొడలపేట కాలనీవాసులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

పట్టాల పంపిణీ

ఆదోని అర్బన్ : పట్టణంలోని 15వ వార్డు కొడల్ పేటలోని పేదలకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి గురువారం పట్టాలు అందజేశారు. స్థానిక కార్యాలయం వద్ద 15వ వార్డు కౌన్సిలర్ బండిహసీనా ఆధ్వర్యంలో 110 మంది మహిళలకు పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రూ.2,100 కట్టిన వారికి ఈఎస్ఐ ఆసుపత్రి వెనక భాగంలోనున్న స్థలాలకు సంబంధించిన పట్టాలు అందజేసినట్లు తెలిపారు. డీడీలు చెల్లించినా పట్టాలు రాకపోతే తమను సంప్రదించాలని సూచించారు.

కుట్టు మిషన్ల పంపిణీ

ఆదోని అర్బన్ : స్థానిక ఉర్దూగర్ అల్‌ఫలాహ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో ఎమ్మెల్యే సౌజన్యంతో 11 మంది మహిళలకు గురువారం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలైన 11 మంది ముస్లిం మహిళలు అభ్యున్నతి సాధించేందుకు కుట్టుమిషన్‌లను అందజేశామని చెప్పారు. ముస్లిం మతపెద్దలు, వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

వ్యాపారులకు సన్మానం



వ్యాపారులను సన్మానించిన యార్డు చైర్మన్, సెక్రటరీ

ఆదోని అర్బన్ : స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ–నామ్‌లో అత్యధిక బిడ్డింగ్ నమోదు చేసిన పత్తి, వేరుశనగ వ్యాపారులను గురువారం యార్డు చైర్మన్ మాబాషా, సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి సన్మానించారు. వారు మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఈ–నామ్ ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో ఆదోని మార్కెట్‌యార్డు కోటి బిడ్‌లు నమోదై ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. పత్తి కొనుగోలులో 44,452 బిడ్లు నమోదు చేసిన కొనుగోలుదారుడు కె.మంజునాథ్ కాటన్ ట్రేడర్స్ ప్రొప్రైటర్ నాగరాజు, వేరుశనగ కొనుగోలులో అత్యధిక బిడ్‌లు 13,576 నమోదు చేసిన కొనుగోలుదారుడు మహ్మద్ ట్రేడర్స్ ప్రొపైటర్ దస్తగిరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యార్డు పర్యవేక్షకులు నాగరాజ్, శాంతాదేవి, అశోక్, డైరెక్టర్‌లు మల్లికార్జున, అనిల్, విజయ్, వ్యాపారులు పాల్గొన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలపై నిరసన

ఎమ్మిగనూరుటౌన్: వీరసింహారెడ్డి సినిమా సక్సెస్ మీట్‌లో అక్కినేనిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు బాలకృష్ణపై పట్టణంలోని అక్కినేని అభిమానులు గురువారం ఆందోళనకు దిగారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ వరకు నిరసన ర్యాలీ చేపట్టి బాలకృష్ణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కినేని అభిమాన సంఘ నాయకులు, అభిమానులు గుడికల్ భాస్కర్, వైస్ ఎంపీపీ పోలయ్య, మోహన్, తదితరులు మాట్లాడుతూ.. సినీ ఇండస్ట్రీలో వివాదాలకు దూరంగా ఉండి ప్రేక్షకుల అభిమానం సంపాదించుకున్న అక్కినేని కుటుంబంపై బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటిదూల బాలయ్య అక్కినేని కుటుంబానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.